గాయత్రిమాత దర్శనం.. విద్యాధరి వైభవం



వర్గల్ సరస్వతిదేవి ఆలయంలో నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారిని శుక్రవారం గాయత్రిమాతగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో వరుసకట్టి అమ్మను దర్శించుకొని పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భరతనాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. – న్యూస్‌టుడే, వర్గల్

అత్యాధునిక సైన్స్ సెంటర్ రూపొందించాలి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో అన్నివర్గాల వారికి ఉపయోగపడేలా అత్యాధునికమైన సైన్స్ సెంటర్‌ను ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా పాలనాధికారి మనుచౌదరి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లోని సైన్స్ మ్యూజియాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ప్రకారం ప్రణాళికలు రూపొందించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సైన్స్‌ఫోరం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో శుక్రవారం ఆయన ఈ విషయమై చర్చించారు. ఈ సందర్భంగా సైన్స్ సెంటర్ ఆవశ్యకత, సైన్స్ సెంటర్ ఏ విధంగా రూపొందించాలనే వివిధ రకాల సలహాలు, సూచనలు చేశారు. సెక్టోరల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, భౌతిక, జీవశాస్త్ర ఫోరం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ప్రణాళికను కలెక్టర్ మనుచౌదరికి అందిస్తున్న విద్యాశాఖ అధికారులు

పండ్ల సాగు.. ఎంతెంత దూరం?

సగం లక్ష్యమైనా చేరలేదు

న్యూస్‌టుడే, సిద్దిపేట అర్బన్:

ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో తప్పనిసరిగా స్థానికంగా పండే పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పండ్ల దిగుబడి పెంచడానికి రైతులకు అవగాహన కల్పించి తోటలు ఏర్పాటు చేయించేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి లేదు. పండ్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. జిల్లాలో తోటలు సక్రమంగా చేపట్టక పోవడంతో మార్కెట్‌లో డిమాండ్‌తో పాటు ధరలు ఎక్కువగా ఉన్నాయి. నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో ప్రతి ఏడాది వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఆ పంటకు ప్రత్యామ్నాయంగా పండ్ల తోటల సాగును చేపట్టాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉపాధి హామీ పథకం కింద తోటల సాగుకు నిధులు మంజూరు చేస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు రాయితీ సైతం కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎంపిక చేసిన రకాలు

- మామిడి
- తీపి ఆరెంజ్
- జామ
- సీతాఫలం
- కొబ్బరి
- డ్రాగన్ ఫ్రూట్
- దానిమ్మ



ఉపాధి హామీలో సాగైన మామిడి తోట

తోటల సాగు	విస్తీర్ణం (ఎకరాల్లో)
మామిడి	450
డ్రాగన్ ఫ్రూట్	6
సీతాఫలం	22
తీపి ఆరెంజ్	12
దానిమ్మ	6
జామ	4

మూడేళ్లు ప్రభుత్వమే..

పండ్ల తోటల సంరక్షణ బాధ్యతను మూడేళ్ల వరకు ప్రభుత్వమే చూస్తుంది. రకాలను బట్టి ఒక్కో మొక్క సంరక్షణకు రూ.20 నుంచి రూ.44 చొప్పున రైతులకు చెల్లిస్తుంది. ఉపాధి కూలీలతో గుంతలు తవ్విస్తుంది. మొక్కలు నాటిస్తుంది. నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం చేపడుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి:

– జయదేవ్ ఆర్య, డీఆర్డీవో

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. కర్షకులకు అవగాహన కల్పిస్తున్నాం. మొక్కల కొనుగోలు నుంచి నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. జాబ్ కార్డు కలిగి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలి. నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరలోనే అధిగమిస్తాం.

- 2023లో 1000 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా పూర్తయింది.
- 2024లో 2000 ఎకరాల్లో పెంపకం చేపట్టాలని ముందడుగు వేస్తున్నారు. ఇప్పటికి కేవలం 500 ఎకరాల్లో మాత్రమే వేయించారు.
- ఈ సంవత్సరం 1100 ఎకరాల భూమిని పండ్ల తోటలకు అనువైనదిగా అధికారులు గుర్తించారు. మిగతా స్థలం కోసం ఆరా తీస్తున్నారు.

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

న్యూస్‌టుడే, హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రాంతంలో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోయింది. మీర్జాపూర్‌లో నాటుబాంబు పేలిన ఘటనతో చట్టవ్యతిరేక కార్యకలాపాలు కొనసాగుతున్న వ్యవహారాలు వెలుగుచూశాయి. ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నాయి. వన్యప్రాణులను వేటాడే ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హుస్నాబాద్ మండలం మీర్జాపూర్, జిల్లెల్లగడ్డ, మహ్మదాపూర్, భీమదేవరపల్లి మండలం మంగలపల్లె, గట్లనర్సింగాపూర్ గ్రామాలను ఆనుకొని గుట్టలు విస్తరించి ఉన్నాయి. గుట్టల పరిసరాల్లో పంటలు సాగు చేస్తారు. ఇక్కడే అటవీ భూములు ఉన్నాయి. పంట పొలాల్లోకి వచ్చే వన్యప్రాణులను హతమార్చి వాటి మాంసాన్ని విక్రయించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని అక్రమంగా వేటాడుతున్నారు.



స్వాధీనం చేసుకున్న నాటుబాంబు

మీర్జాపూర్‌లో నాటుబాంబుల తయారీ

పూర్తిస్థాయిలో నిఘా లేకపోవడంతో ఏళ్ల తరబడి ఈ దందా కొనసాగుతోంది. పొలాలు, గుట్టల ప్రాంతాల్లో అడవి పందులు సంచరిస్తుంటాయి. అవి తిరిగే చోట నాటుబాంబులు పెడుతున్నారు. రాత్రిపూట పంటల వద్దకు గుంపులుగా పందులు వస్తాయి. నాటుబాంబులు పెట్టి హతమార్చి మాంసం అమ్ముకుంటారు. సొంతంగా నాటుబాంబులను తయారు చేస్తున్నారు. మీర్జాపూర్‌లో ఖాళీగా ఉన్న ఇంట్లో నాటుబాంబులు తయారుచేస్తున్నట్లుగా సమాచారం తెలుసుకొని పోలీసులు వెళ్లి వారిని పట్టుకున్నారు. మీర్జాపూర్‌కు చెందిన ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు అనుమానితులు ఉన్నట్లు చెబుతున్నారు. కొన్నిరోజుల క్రితం ప్రమాదవశాత్తు పేలి ఒకరి చేతికి గాయం అయింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చాకచక్యంగా ముఠా సభ్యుల అడ్డా తెలుసుకొని వెళ్లి పట్టుకున్నామని హుస్నాబాద్ సీఐ కొండ్రు శ్రీను తెలిపారు. గుట్టల ప్రాంతాలు అధికంగా ఉండటంతో వన్యప్రాణులను హతమార్చి మాంసం అమ్ముతున్నారని.. వారి చర్యలను పటిష్ఠ నిఘాతో నిలువరిస్తామని చెప్పారు.

చెమ్కీలు.. చాక్లెట్ల బతుకమ్మలు



ప్రకృతిని దగ్గర చేసే బతుకమ్మకు అనేక రూపాలు. కొందరు ఔత్సాహికులు వివిధ వస్తువులతో బతుకమ్మలను తయారుచేస్తున్నారు. అమ్ముతున్నారు. సిద్దిపేట పట్టణంలో పూసలు, నాణేలు, చాక్లెట్లు, చెమ్కీలు, దారాలు, గాజు సామగ్రితో తయారుచేశారు. ఇవి మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కొందరు వీటిని ఇళ్లలో అలంకరణగా ఏర్పాటు చేసుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

హుస్నాబాద్‌లో ‘వాహన’ బంద్!

న్యూస్‌టుడే, హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో జాతీయ రహదారి నిర్మాణ పనులతో ట్రాఫిక్ ఇబ్బందులు అధికమయ్యాయి. అంబేడ్కర్, మల్లెచెట్టు చౌరస్తా వద్ద రద్దీ నెలకొంటోంది. పట్టణంలో ప్రధాన రహదారి రెండు కి.మీ. పొడవున ఒకవైపున నిర్మాణానికి తవ్వకాలు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకోలేదు. మరోవైపు కాలువల నిర్మాణం జరుగుతోంది. అంబేడ్కర్ చౌరస్తా వద్ద జనగామ వైపు నుంచి, కరీంనగర్ వైపు నుంచి హనుమకొండ, సిద్దిపేట జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలు అధికంగా ఉంటున్నాయి. పండుగ సీజన్ కావడంతో వాహనాల రాకపోకల సంఖ్య మరింత పెరిగింది. శుక్రవారం మధ్యాహ్నం అంబేడ్కర్ చౌరస్తా వద్ద గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభించడంతో ఎస్ఐ మహేశ్, సిబ్బంది వచ్చి క్రమబద్ధీకరించారు. రహదారి పనులు పూర్తయ్యే వరకు ఇబ్బందులు తప్పేట్లు లేవు. చౌరస్తా వద్ద సిబ్బందిని ఏర్పాటు చేస్తామని ఎస్ఐ చెప్పారు.



అంబేడ్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ రద్దీ

నడుస్తున్న కారులో హత్యాయత్నం ఏడుగురి అరెస్టు

బెజ్జంకి, న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల విషయంలో సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారిపై నడుస్తున్న కారులోనే యువకుడిపై కత్తితో దాడి చేస్తూ హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. బెజ్జంకికి చెందిన సోమని ప్రవీణ్.. కోరుట్లలో నివాసం ఉంటూ డ్రైవర్‌గా చేస్తున్నారు. బెజ్జంకికి చెందిన వేల్పుల శ్రీకాంత్, వేల్పుల శ్రీను, వేల్పుల చందుతో ఆర్థిక వ్యవహారాలపై కొద్ది రోజులుగా గొడవ జరుగుతోంది. తమ డబ్బులు ఇవ్వడం లేదని వారు ప్రవీణ్‌పై కక్ష పెంచుకున్నారు. ఈ నెల 3న తన కారులో హైదరాబాద్‌కు ప్రవీణ్ వెళ్తున్నారని నిందితులు తెలుసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన హరీశ్, మహేందర్, బెజ్జంకికి చెందిన సందీప్, శ్రీహరి సాయాన్ని నిందితులు తీసుకున్నారు. రెండు కార్లలో మాటు వేసి సిద్దిపేట జిల్లా తోటపల్లి రాజీవ్ రహదారి శివారుకు చేరుకోగానే ప్రవీణ్ వాహనాన్ని అడ్డగించారు. అందులోని ప్రయాణికులను బెదిరించి అక్కడినుంచి వెళ్లగొట్టారు. కారులోకి ఎక్కి నిందితుల్లో ఒకరు కారును నడిపాడు. తోటపల్లి శివారు నుంచి శంకర్‌నగర్ శివారు 3 కి.మీ. దూరం వరకు ప్రవీణ్‌ను కొడుతూ, కత్తితో దాడి చేస్తూ వెళ్లారు. అక్కడ ప్రవీణ్‌ను కారుతో పాటు వదిలేసి నిందితులు పరారయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చేరుకొని తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలించి పట్టుకున్నారు. వారి నుంచి రెండు కార్లు, ఏడు ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

నేటితో ముగియనున్న ధ్రువపత్రాల పరిశీలన

సిద్దిపేట, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థుల్లో కొందరు ఒకటికి మించి ఎక్కువ పోస్టులకు అర్హత సాధించారని, సంబంధిత అభ్యర్థుల వివరాలను deosiddipet.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఈవో శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలో 43 మంది అభ్యర్థులు ఉన్నారని, ఈ నేపథ్యంలో ఎక్కువ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలలోపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డిక్లరేషన్ (రాత పూర్వకంగా) సమర్పించాలన్నారు. శుక్రవారం కూడా 1:3 ప్రాతిపదికన ధ్రువపత్రాల పరిశీలన కొనసాగిందని, 271 మంది హాజరైనట్లు తెలిపారు. నేటితో ఈ క్రతువు ముగియనుందని, మిగిలిన అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దు

సిద్దిపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర యాజమాన్యాల పరిధిలో కొనసాగే జూనియర్ కళాశాలలకు ఈనెల 6 నుంచి 13 వరకు ఇంటర్ విద్యాశాఖ దసరా సెలవులు ప్రకటించిందని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతగిరి.. చూసి తనివి తీరాల్సిందే!


సెలవుల్లో సందర్శించాల్సిన స్థలం

న్యూస్‌టుడే, వికారాబాద్

ఆ మార్గంలో వెళ్తే ప్రకృతి మనల్ని పలకరిస్తుంది.. ఎత్తయిన గుట్టలు.. మయూరాల విన్యాసాలు.. పరుగులు తీసే జింకలు.. పక్షుల కిలకిలరావాలు.. అనంతపద్మనాభస్వామి ఆలయం.. ఇవన్నీ అనంతగిరి సొంతం. రాష్ట్రరాజధాని హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరంలోని అనంతగిరికి వస్తే సహజసిద్ధ ప్రకృతి ఒడిలో సేదతీరవచ్చు. ఇక్కడి కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటు షికారు చేయొచ్చు. ఇక్కడికొస్తే రోజంతా ఆహ్లాదంగా గడిపేందుకు ఎన్నో అవకాశాలున్నాయి. మరెందుకు ఆలస్యం.. దసరా సెలవుల్లో అనంతగిరికి వచ్చి ఇక్కడి అందాలను ఆస్వాదించి వద్దాం పదండి.

అనంతగిరి విశేషాలు
- విస్తరించిన ప్రాంతం 3750 ఎకరాలు
- వన్య ప్రాణులు 16
- పక్షులు 75
- ఔషధ వృక్షాలు 307

వికారాబాద్‌ను ఆనుకొని వేలాది ఎకరాల్లో విస్తరించిన అనంతగిరి అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలను గుర్తించిన అప్పటి నిజాం ఏడో నవాబు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ ఛాతీ వైద్య ఆసుపత్రి (క్షయ చికిత్సాలయం) నిర్మించారు. ఇక్కడికి సమీప పట్టణాలు, గ్రామాలతో పాటు కర్ణాటక రాష్ట్రం బీదర్, గుల్బర్గాకు చెందిన క్షయ పీడితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఎన్నో రకాల పక్షులు, వన్యప్రాణులకు ఈ ప్రాంతం నెలవైందని తేలింది. డెహ్రాడూన్ నుంచి ఔషధ మొక్కలు తీసుకొచ్చి అనంతగిరిలో నాటి ఔషధ ఝరిగా రూపొందించడానికి కృషి జరుగుతోంది.

ఔషధ మొక్కల సంరక్షణ

అటవీ ప్రాంతంలోని మైదానాలు, ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలు నాటారు. వాటికి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అనువైన ప్రదేశాల్లో వేప, జిల్లేడు, నక్కెర, బిల్లేడు, ఉసిరి, మర్రి, మేడి, దంతి, గుంపెన, ఇప్ప, మామిడి, చింత, నల్లజీడి, చిల్ల, తాని, కరక, పాలకొడిశ తదితర ఔషధాలకు చెందిన వాటిని నాటి సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

బుగ్గ రామలింగేశ్వరాలయం

అనంతగిరికి వచ్చిన పర్యాటకులు బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటుంటారు. త్రేతాయుగంలో రాముడు రావణ సంహారం తర్వాత ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. శివలింగాన్ని అభిషేకించేందుకు రాముడు బాణం వేసి పాతాళగంగను పైకి రప్పించాడని ప్రతీతి. గంగ బుడగ రూపంలో రావడంతో బుగ్గ రామలింగేశ్వరుడు అన్న పేరు వచ్చిందని చరిత్ర. ఆలయంలోని నంది నోట్లో నుంచి నిరంతరం నీటి ధార వస్తూనే ఉంటుంది.

ప్రాజెక్టు చెంత

అనంతగిరిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు చూసి తీరాల్సిందే. వికారాబాద్‌కు 24 కి.మీ. దూరంలో ధారూర్ అటవీ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఉంది. ప్రకృతి ప్రేమికులను ఇట్టే ఆకట్టుకుంటుంది. బోట్‌లో షికారు చేసే అవకాశం ఉండటంతో అత్యధికులు ఇక్కడికి వస్తుంటారు. దట్టమైన చెట్లతో కూడిన ప్రకృతి రమణీయ దృశ్యాలను చూసి తరించాల్సిందే. శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో సందడిగా ఉంటుంది.

ఔషధ మొక్కల సంరక్షణకు..:

ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎన్నో రకాల ఔషధ మొక్కలున్నాయి. మరిన్ని నాటి సంరక్షించేందుకు ప్రణాళికతో అడుగులేస్తున్నాం. అడవి అభివృద్ధికి సైతం అన్ని రకాల కృషి జరుగుతోంది. ఇక్కడికొచ్చే సందర్శకులకు వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో


బోటింగ్ షికారు

ప్రతిభ వెలికి తీసేందుకే పోలీసు డ్యూటీ మీట్


సంగారెడ్డి జిల్లా పోలీసు అధికారులతో సమావేశమైన మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నామని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరం జరిగిన తర్వాత ఆధారాల సేకరణపై జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 14 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోనల్ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. జోనల్ స్థాయిలో... నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి(ప్రథమ), వికారాబాద్ సీఐ రఘురాం (ద్వితీయ), కొండాపూర్ ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రాంమోహన్‌రెడ్డి, నరేందర్, వికారాబాద్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి, ఏఆర్ డీఎస్పీ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట లఘు క్రీడామైదానంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ కార్యదర్శి సౌందర్య వెల్లడించారు. 7వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.

ఐఐటీహెచ్‌లో హాఫ్ మారథాన్ పోటీలు

ఈ నెల 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: భారతీయ సాంకేతిక సంస్థ-హైదరాబాద్(ఐఐటీహెచ్) రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో హాఫ్ మారథాన్ పేరుతో పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ రాష్ట్రాలు, నగరాలకు చెందిన వారిని ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 1న ఐఐటీ క్యాంపస్ ఆవరణలో ఉదయం 5 గంటలకు 21.1 కి.మీ. హాఫ్ మారథాన్, 10, 5 కి.మీ పరుగు పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గలవారు https://www.iithydrunnersclub.comegistration ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పతకాలు, ధ్రువపత్రాలు అందించనున్నట్లు తెలిపారు.

వేర్వేరు కారణాలు.. ఐదు బలవన్మరణాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యలు చేసుకోవడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఒకే రోజు ఐదు ఘటనలు జరగడం.. జిల్లా పోలీసులను ఉలికిపాటుకు గురిచేసింది.

ఆ తల్లి శోకం తీరనిది..


లక్ష్మణ్

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: భర్త దూరం కాగా, ఉన్న ఒక్క కొడుకే తన సర్వస్వం అనుకుంది ఆ తల్లి. ఇంతలో ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆమెకు తీరని వేదన మిగిలింది. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. అల్లాదుర్గంకు చెందిన లక్ష్మి భర్త నర్సింలు పదేళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కూలీ పనులు చేస్తూ కుమారుడు లక్ష్మణ్(23)ను పోషించింది. కూలీ పని చేసుకొని దసరాకు దుస్తులు కొనుక్కొని వస్తానని కుమారుడు పది రోజుల క్రితం సంగారెడ్డికి వెళ్లాడు. శుక్రవారం అల్లాదుర్గం శివారులోని పటేల్ చెరువులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు పరిశీలించి.. దుస్తుల ఆధారంగా లక్ష్మణ్‌దని నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భార్య ఆరోగ్యం క్షీణించడంతో..


మహేశ్

చిలప్‌చెడ్: మెదక్ జిల్లా చిలప్‌చెడ్‌కు చెందిన మహేష్(33), సావిత్రి భార్యాభర్తలు. సావిత్రి ఆరోగ్యం క్షీణించడంతో 15 రోజులుగా పుట్టింట్లో ఉంటోంది. మనస్తాపం చెందిన భర్త శుక్రవారం తన పెద్దన్న యాదయ్య ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. సావిత్రి ఫిర్యాదు మేరకు చిలప్‌చెడ్ ఎస్సై యాదగిరి కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు..


క్రిష్ణ

కౌడిపల్లి: కౌడిపల్లికి చెందిన బర్ల క్రిష్ణ(44), శోభ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. అతను వ్యవసాయం, సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె వార్డు మాజీ సభ్యురాలిగా పనిచేశారు. ఒక కుమార్తెకు పెళ్లి చేశారు. వివిధ అవసరాలకు చేసిన అప్పులు తీరక క్రిష్ణ సతమతమవుతున్నాడు. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. భార్య శోభ ఫిర్యాదుతో ఎస్సై రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కుమారుడు లేకపోవడంతో తల్లి లచ్చమ్మ అంత్యక్రియలు చేసింది.

ఇంటికి చేసిన అప్పు భారమై..


మహేష్

కొండపాక గ్రామీణం: కొండపాకకు చెందిన శ్రీరాం మహేష్(38), రమ దంపతులకు ఒక కుమార్తె ఉంది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల రూ.3 లక్షలు అప్పు చేసి కొత్తింటిని నిర్మించుకున్నారు. 15 రోజుల క్రితమే గృహప్రవేశం చేశారు. చేసిన అప్పు తీర్చే విషయంలో మనస్తాపం చెందిన మహేష్ శుక్రవారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రమ ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు.

భూవివాదంతో మనస్తాపం చెంది..


అశోక్

రామాయంపేట: ఎకరం భూ వివాదంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రామాయంపేట మండలం ఝాన్సీలింగాపూర్‌కు చెందిన ఎర్ర అశోక్(38)కు దాయాదులకు సుమారు ఎకరా భూమి విషయమై కొంత కాలంగా వివాదం నెలకొంది. పలుమార్లు పంచాయితీ నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదు. మనస్తాపం చెందిన అశోక్ తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. బాధిత కుటుంబీకులు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తరలించమని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారికి నచ్చజెప్పి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భూ వివాదంతోనే తన భర్తను చంపారని భార్య బాబాయి ఆరోపించింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ బాలరాజు తెలిపారు.

పరిశోధన ఫలాలు రైతులకు అందించడమే లక్ష్యం


పత్రాలు మార్చుకుంటున్న నీరజ ప్రభాకర్, వీవీయో గ్లోబల్ సంస్థ ప్రతినిధులు

ములుగు, న్యూస్‌టుడే: ఉద్యాన పంటలపై చేసిన పరిశోధనల ఫలితాలను రైతులకు అందించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం పరిపాలన విభాగం కార్యాలయంలో వర్సిటీ, వీవీయో గ్లోబల్ సంస్థల మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. వీవీయో గ్లోబల్ సంస్థ.. దక్షిణ కొరియా దేశానికి చెందిన పలు సంస్థలతో కలిసి పరిశోధనలు చేస్తుందన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, లక్ష్మీనారాయణ, విజయ, సంస్థ ప్రతినిధి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే బడుల పరిరక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సంఘం జిల్లా స్థాయి అధ్యయన తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సమాజం పట్ల లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ రకాల కారణాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గుతోందన్నారు. సర్కారు పాఠశాలల పరిరక్షణకు ప్రతి యూటీఎఫ్ కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యారంగ పరిణామాలు అనే అంశంపై కార్యకర్తలకు బోధించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, జిల్లా అధ్యక్షుడు షేక్ వలీ అహ్మద్, కార్యదర్శి తప్పెట్ల యాదగిరి, ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

మలుపులో ఢీకొన్న బస్సు, కారు

ఒకరి దుర్మరణం, ముగ్గురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

కల్హేర్, న్యూస్‌టుడే: మలుపు వద్ద ఆర్టీసీ బస్సు-కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాలు.. రేగోడు మండలం గజ్వాడలోని ఒకే కుటుంబానికి చెందిన భూమవ్వ(55), పాపయ్య, దుర్గయ్య, స్వరూప, రుత్వి, పుంతి హైదరాబాద్‌కు వెళ్లి శుక్రవారం తిరుగు పయనమయ్యారు. నిజాంపేట్ మండలం మునిగేపల్లి శివారులోని మలుపు వద్ద ఎదురుగా వచ్చిన నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు వారు ప్రయాణిస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో భూమవ్వ(55) అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త పాపయ్య, కుమారుడు దుర్గయ్య, కోడలు స్వరూపలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్సులో నారాయణఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారి పరిస్థితి విషమంగా ఉండటంతో పాపయ్య, స్వరూపను మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలిని ఎస్సై పరిశీలించి.. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..


జావిద్

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మోమిన్‌పేట ఠాణా పరిధిలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై అరవింద్ తెలిపిన ప్రకారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం కటికే గేరికి చెందిన మహ్మమద్ పాషమియా, ఫర్జాన దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. చిన్నకుమారుడు మహ్మమద్ జావీద్(24), అతని మిత్రుడు మఫాజ్‌పటేల్‌తో కలిసి గురువారం కోట్‌పల్లికి వెళ్లారు. అదే రోజు రాత్రి సదాశివపేటకు తిరిగి వస్తుండగా, మండల పరిధి మోరంగపల్లి శివారులో రోడ్డుపై గుంత ఉండడంతో, వాహనం అదుపు తప్పి ఇద్దరూ కింద పడ్డారు. జావిద్ తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మఫాజ్‌కు గాయాలు కావడంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడినుంచి గాంధీకి తరలించారు. శుక్రవారం జావీద్ అన్న హనీఫ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వివరించారు.

సర్పం.. స్నేహపూర్వకం



పాములు.. రైతులకు, వన్యప్రాణుల సమతుల్యానికి స్నేహకారకమయ్యేవి. అన్ని పాములూ విషపూరితమైనవి కావు. వీటి అవగాహన కోసం 70వ 'వన్యప్రాణి వారోత్సవాలు' పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రాకేశ్ ప్రదర్శన నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, అటవీ శాఖ సిబ్బందికి సర్పాలపై అవగాహన కల్పించారు. డీఆర్డీవో జయదేవ్ ఆర్య, అటవీశాఖ క్షేత్ర అధికారి ఇక్రముద్దీన్, దుబ్బాక రేంజ్ అధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

ఈఎస్ఐ ఆసుపత్రికి రెండోసారి తాళం



తూప్రాన్, న్యూస్‌టుడే: పుర పరిధి పోతురాజుపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ ఆసుపత్రికి యజమాని తాళం వేయడంతో సేవలు నిలిచిపోయాయి. పది నెలలకు సంబంధించిన అద్దె బకాయిలు రాకపోవడంతో గత ఏప్రిల్‌లో తాళం వేశాడు. అప్పుడు బకాయిలు చెల్లించి తాళం తీయించారు. పుర పరిధిలోకి మారాక దాని ప్రకారం అద్దె చెల్లించాలని డిమాండ్ చేస్తూ మరోసారి శుక్రవారం తాళం వేశాడు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడు సాయిభరత్‌ను వివరణ కోరగా.. అద్దె పెంచాలని కోరుతూ యజమాని తాళం వేశాడన్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

నలుగురు దొంగల రిమాండ్

చేగుంట, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలను ధ్వంసం చేస్తూ అందులో నుంచి కాపర్ కాయిల్స్‌ను చోరీ చేస్తున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపారు. హరియాణకు చెందిన జుబేర్‌ఖాన్, ఇర్షాద్, రాజస్థాన్‌కు చెందిన ఫజార్, జాహిద్‌లు చేగుంట పోలీసు స్టేషన్ పరిధిలోని పోతాన్‌శెట్టిపల్లిలో విద్యుత్తు నియంత్రికను 15 రోజుల క్రితం ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను చోరీ చేసి విక్రయించారు. అలాగే గత నెలలో మాసాయిపేటలో జప్తు చేసిన రైస్‌మిల్లుల్లో ఉన్న విద్యుత్తు నియంత్రికలోని కాపర్ కాయిల్స్‌ను చోరీ చేశారు. వీటిని విక్రయించేందుకు కారులో తీసుకెళ్తున్నారు. వడియారం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి వారిని పట్టుకొని విచారించగా రెండో చోట్ల చోరీ చేసినట్లు అంగీకరించారు. కారుతో పాటు అందులో ఉన్న కాపర్ కాయిల్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అత్యాశకు పోయి.. జైలుపాలు

పురాతన విగ్రహం చోరీ కేసులో ఐదుగురి అరెస్టు


టేక్మాల్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

టేక్మాల్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చదివి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాల్సిన యువకులు అత్యాశకు పోయి జైలుపాలయ్యారు. జైన విగ్రహాన్ని చోరీ చేసి విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన అనువింద్, జగత్, పెద్దపేటకు చెందిన శుభానంద్, కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన తేజసాయిబాబు, పామర్రుకు చెందిన మహేశ్‌బాబు హైదరాబాద్‌లో బీటెక్ చదివారు. రాత్రికిరాత్రే డబ్బులు సంపాదించాలని యూట్యూబ్, సామాజిక మాధ్యమాల ఆధారంగా పురాతన దేవాలయాలు గుర్తించారు. వెల్పుగొండలోని గుట్టపై పార్శ్వనాథుని పురాతన విగ్రహం ఉన్న విషయం తెలుసుకున్నారు. జులై 26న ఇక్కడికి చేరుకొని విగ్రహాన్ని తీసుకెళ్లారు. విగ్రహానికి సరైన ధర రాకపోవడంతో అమ్మలేదు. గ్రామస్థుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఐదుగురు నిందితులను పట్టుకున్నారు. విగ్రహాన్ని గ్రామస్థులకు అప్పగించి, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, టేక్మాల్ ఎస్సై రాజేశ్‌లు ఉన్నారు. వెల్పుగొండ మాజీ సర్పంచి నారాయణతో పాటు గ్రామస్థులు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి డీఎస్పీ, సీఐ, ఎస్సైలను సన్మానించారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి దుర్మరణం



మల్ల రాజు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేటలో చోటుచేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని నర్సాపురానికి చెందిన రెడ్డిమల్ల మల్లవ్వ, శరబంధు దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. గతంలోనే శరబంధు మృతి చెందాడు. మల్లవ్వ కూతురు పెళ్లి చేసింది. కుమారుడు రాజు (34) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కోమటిచెరువు నుంచి బయటకు వచ్చే నీటిలో మంగళవారం గాలం వేశాడు. బుధవారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లేకపోవడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున నీటిలో రాజు మృతదేహం తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్డ్	197-00
స్కిన్‌లెస్	224-00

ఆరేళ్లకు రాష్ట్రస్థాయి పోటీలకు ఆతిథ్యం


ఇందిరా గాంధీ స్టేడియంలోని క్రీడా మైదానం

పోటీలో పాల్గొనే వారి వివరాలు
- జట్లు: 10 (ఉమ్మడి జిల్లాలు)
- వ్యాయామ ఉపాధ్యాయులు: 42
- రిఫరీలు: 06
- కోచ్‌లు, మేనేజర్లు: 20
- క్రీడాకారులు: 180

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించడంతో పాటు బాక్సింగ్ అకాడమీగా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన మెదక్‌లోని ఇందిరాగాంధీ మైదానం.. ఆరేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు ముస్తాబైంది. 2017-18లో జాతీయ, 2016-17 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఇక్కడే జరిగాయి. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయుల చొరవతో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి రూ.5.50 కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు ఆరేళ్ల కిందట మైదానాన్ని మూసేశారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం పూర్తవగా, దీని మధ్యలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో ఫుట్‌బాల్ మైదానాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఇందులోనే పోటీలు జరుగనున్నాయి. స్టేడియం మొత్తం 7 ఎకరాలలో విస్తరించి ఉండగా, ఇక్కడ నిర్మించి గ్యాలరీలో 20 వేల మంది ప్రేక్షకులు కూర్చోవచ్చు.

మూడు రోజులు

ఎస్జీఎఫ్ అండర్-17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలను ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగనున్నాయి. ఇందిరాగాంధీ మైదానంతో పాటు వెస్లీ పాఠశాల మైదానంలోనూ పోటీలు జరుగనున్నాయి. మొత్తం 24 మ్యాచ్‌లు జరుగుతాయి. స్థానిక టీజీ ఆర్ఎస్ పాఠశాలలో క్రీడాకారిణులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

- రాష్ట్రంలో పచ్చికతో కూడి ఉన్న ఏకైక స్టేడియం మెదక్‌దే కావడం విశేషం. 110 మీ. పొడవు, 70 మీ. వెడల్పుతో విస్తరించి ఉంది. జాతీయ స్థాయి పోటీలు పచ్చిక మైదానాల్లోనే కొనసాగుతాయి.

- న్యూస్‌టుడే, మెదక్ టౌన్

అన్ని ఏర్పాట్లు పూర్తి..: నాగరాజు, ఫుట్‌బాల్ అసోసియేషన్, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి



క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఆరేళ్ల తర్వాత తొలిసారిగా రాష్ట్ర స్థాయి పోటీలు జిల్లాలో జరుగుతున్నాయి. ప్రశాంతంగా పూర్తిచేసేలా, జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు వచ్చేలా అందరం కలిసి కృషి చేస్తున్నాం.

పండగల వేళ రైట్.. రైట్

- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- రద్దీకి అనుగుణంగా నడిపేందుకు కార్యాచరణ

ప్రత్యేక సర్వీసులు ఇలా.. (డిపో / బస్సులు)

డిపో	బస్సులు	డిపో	బస్సులు
మెదక్	79	నర్సాపూర్	97
నారాయణఖేడ్	55	సిద్దిపేట	59
సంగారెడ్డి	72	దుబ్బాక	13
జహీరాబాద్	86	పరిగి	16
తాండూరు	10	వికారాబాద్	8
గజ్వేల్-ప్రజ్ఞాపూర్	39		



బతుకమ్మ, దసరా పండగలను అత్యధికులు సొంతూరిలో వేడుక చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఇందుకు సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఆర్టీసీ బస్సు ప్రయాణానికి మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో పండగల రద్దీ దృష్ట్యా ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ కార్యాచరణ రూపొందించింది.

రీజియన్ పరిధిలో..

మెదక్ రీజియన్ పరిధిలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 8, రంగారెడ్డి రీజియన్‌లోకి వచ్చే వికారాబాద్ జిల్లాలో మూడు డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల పరిధిలో ప్రత్యేక బస్సు సర్వీసులకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. పండగల సందర్భంగా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా 500 సర్వీసులను నడపాలని నిర్ణయించారు. ప్రత్యేక సర్వీసులు ఈనెల 11 వరకు నడిపిస్తారు.

ఇబ్బంది లేకుండా..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలకు చెందిన చాలా మంది ఉద్యోగ, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. కొంతమంది అక్కడే స్థిరపడ్డారు. బతుకమ్మ, దసరా పండగలకు వారిలో అత్యధికులు సొంతూరికి వస్తుంటారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపించనున్నారు.

- వికారాబాద్ జిల్లాలో పాఠశాలలకు చెందిన 40 బస్సులు వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించారు.

ముందస్తు రిజర్వేషన్‌కు..

దూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందస్తుగా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. ముందస్తు టికెట్ రిజర్వేషన్‌కు www.tsrtconline.in/www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సి ఉంటుంది.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, పరిగి

సద్వినియోగం చేసుకోవాలి: ప్రభులత, ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్



బతుకమ్మ, దసరా పండగల నేపథ్యంలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నాం. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈమేరకు డిపో మేనేజర్లకు ఆదేశాలు ఇచ్చాం.

పేదలకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే


సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం బెజ్జంకిలోని మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన 37 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. పలు సమస్యలపై వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొని పెండింగ్‌లో ఉన్న సహాయనిధి చెక్కులను త్వరగా మంజూరయ్యేలా చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సీఎం సహాయనిధి కింద అందిస్తున్న సాయం బాధితులకు కొండంత భరోసా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ క్రిష్ణ, వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

7 నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

చేర్యాల, న్యూస్‌టుడే: ఈనెల 7 నుంచి చేర్యాల మండలం కడవేర్గులో ‘కొమ్మూరి యువసేన’ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు క్రీడా పోటీల ప్రచార గోడపత్రికను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆరుట్ల వినీత్, డి.లింగారెడ్డి, తాడెం రమేశ్, నీరటి విజయ్, ఎస్డీ నౌషత్, నరేశ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు.. ప్రవేశం పొందారు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

క్రీడా పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులు

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: వారంతా గ్రామీణ ప్రాంత విద్యార్థులు. వారికి క్రీడలంటే ఇష్టం. ఆ ఆసక్తే వారిని ఆటల్లో రాణించేలా చేసింది. చిన్నారుల ప్రతిభను గుర్తించిన గౌరవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జంగపల్లి వెంకటనర్సయ్య వారిని ప్రోత్సహించారు. అవసరమైన నైపుణ్యాలు, మెలకువలు నేర్పించారు. దీంతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చారు. వారిలో ముగ్గురు విద్యార్థులు ప్రాంతీయ క్రీడా పాఠశాలలకు ఎంపికయ్యారు. అక్కడ వారికి మంచి పోషకాహారంతో పాటు ఉత్తమ శిక్షణ ఇవ్వనున్నారు. తమ భవిష్యత్తుకు బాటలు వేసుకున్న అక్కన్నపేట మండలంలోని విద్యార్థులపై ప్రత్యేక కథనం.

ముందంజలో నిలిచిన రేవంత్



అంతకపేటకు చెందిన బద నాపురం భాస్కర్, సుజాత దంపతుల కుమారుడు రేవంత్‌కు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. తండ్రి వ్యవసాయం చేస్తుండగా తల్లి కూలీ. 3వ తరగతి వరకు అంతకపేట ప్రాథమిక పాఠశాలలో చదివాడు. క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ఎంపిక పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చాడు. ఆదిలాబాద్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలకు ఎంపికయ్యాడు. నెల రోజుల క్రితం అక్కడికి వెళ్లి చదువుతో పాటు ఆటల్లో శిక్షణ పొందుతున్నాడు.


ఆటోడ్రైవర్ కుమారుడు హర్షసాయి

మల్‌చెర్వుతండా పరిధిలోని దుబ్బతండాకు చెందిన బానోతు హర్షసాయి హైదరాబాద్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలకు ఎంపికయ్యాడు.



తండ్రి భాస్కర్ ఆటోడ్రైవర్. తల్లి కూలీ పనులు చేస్తోంది. 3వ తరగతి వరకు హైదరాబాద్‌లో చదివాడు. ఎంపిక పోటీలకు తీసుకెళ్లగా ప్రతిభ చూపి ఎంపికయ్యాడు. ప్రస్తుతం అక్కడే శిక్షణ పొందుతున్నాడు.

స్వయం సాధనతో వైష్ణవి



నర్సింగ్‌తండాకు చెందిన మాలోతు కొరనాయక్, లక్ష్మి దంపతుల కుమార్తె వైష్ణవి కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలకు ఎంపికైంది. తండ్రి గౌరవెల్లి ప్రాజెక్టు పంప్‌హౌజ్ క్యాంప్ కార్యాలయంలో వర్కర్‌గా పనిచేస్తున్నారు. తల్లి తండాలోనే కూలీ పనులు చేస్తోంది. స్థానిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ఓ బాలిక గతేడాది క్రీడా పాఠశాలకు ఎంపికైంది. ఆమె స్ఫూర్తితో స్వయం సాధన చేసిన వైష్ణవి పోటీల్లో ఎంపికై శిక్షణ పొందుతోంది.

దుబ్బాక, న్యూస్‌టుడే:

? దుబ్బాక పురపాలికలోని దుంపలపల్లి 4వ వార్డులో నిర్మించిన క్రీడామ్ పార్కులో పలు ఆట వస్తువులు విరిగి, మందుబాబులకు అడ్డాగా మారింది. – శ్రీనివాస్, దుంపలపల్లి, రాజు, దుంపలపల్లి.

✔ విరిగిన ఆటవస్తువులను మరమ్మతులు చేయించి, పార్కు నిర్వహణను మెరుగుపరుస్తాం. మందుబాబులు అటువైపు రాకుండా చర్యలు తీసుకుంటాం. – కె.రమేశ్ కుమార్, పుర కమిషనర్

? దుబ్బాక రామసముద్రం చెరువులో విపరీతంగా పెరిగిన గుర్రపుడెక్కతో, మత్స్య సంపదకు విఘాతం ఏర్పడుతుంది. సమస్య పరిష్కరించగలరు. – అరవింద్, దుబ్బాక

✔ త్వరలోనే రామసముద్రం చెరువులో ఉన్న గుర్రపుడెక్కను పూర్తిగా తొలగిస్తాం. – జునైద్ అలీ, నీటి పారుదలశాఖ ఏఈ


నంగునూరు, న్యూస్‌టుడే: ? నంగునూరుకు చెందిన చికెన్ వ్యాపారులు నంగునూరు, అంక్షాపూర్, నాగరాజుపల్లి చౌరస్తా సమీపంలో రోడ్డు పక్కన కోళ్ల వ్యర్థాలు విచ్చలవిడిగా పారబోస్తున్నారు. ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. – బాలయ్య, నంగునూరు

✔ కోళ్ల వ్యర్థాలను పారబోస్తున్న చికెన్ వ్యాపారులకు నోటీసులు అందజేసి సమస్యను పరిష్కరిస్తాం – సత్యనారాయణ, ఎంపీఓ, నంగునూరు

? మండల పరిధి సిద్ధన్నపేటలోని ఓ ఏసీజమ్ సమీపంలోని చెరువులో ఆలయం పక్కన అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. చెరువుల రక్షణకు అధికారులు స్పందించాలి – రాజు, సిద్ధన్నపేట

✔ చెరువులో అక్రమంగా ఆలయ నిర్మాణ పనులు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం – జక్కుల రాజు, ఇరిగేషన్ ఏఈ, నంగునూరు

సందడిగా బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న జడ్జి శివరంజని, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో శుక్రవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఆవరణలో బతుకమ్మలను పెట్టి ఆటపాటలతో సందడి చేశారు. వేడుకల్లో జూనియర్ సివిల్‌కోర్టు ప్రిన్సిపల్ జడ్జి శివరంజని, న్యాయవాదులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట: సిద్దిపేటలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం చేపట్టిన బతుకమ్మ ఉత్సవాలు విద్యార్థినుల్లో జోష్ నింపింది. సంప్రదాయ వస్త్రధారణతో పలువురు ఆకట్టుకున్నారు. బతుకమ్మలను పేర్చి ఒకచోట చేర్చి ఆడిపాడారు. జానపద పాటలపై నృత్యాలతో అలరించారు. ప్రిన్సిపల్ డా.వీరారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బెన్సీ, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేటలోని రైతువేదికలో ఈ నెల 5న కూరగాయల సాగు, ఆయిల్‌పామ్ పెంపకం, బిందు పద్ధతిలో వరిసాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఈవోలు తెలిపారు. మండలంలోని రైతులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కొండపాక గ్రామీణం: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరమని భారాస కొండపాక మండలాధ్యక్షుడు నూనెకుమార్ అన్నారు. శుక్రవారం దుద్దెడలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు.

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెకు చెందిన గోత్రాల జ్యోతికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ సర్పంచి శ్రీనివాస్ అందజేశారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

గజ్వేల్ గ్రామీణ, కొండపాక గ్రామీణం, రాయపోల్, మిరుదొడ్డి, హుస్నాబాద్, కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రెండోరోజు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గజ్వేల్‌లోని సంతోషిమాత, మహంకాళి ఆలయాల్లో, మర్పడ్గలోని శ్రీవిజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో అమ్మవారికి అభిషేకం చేశారు. హుస్నాబాద్, రాయపోల్, మిరుదొడ్డి, కోహెడ మండలాల్లోని పలు గ్రామాల్లో దుర్గామాతను అందంగా అలంకరించి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


గజ్వేల్: మహాలక్ష్మిగా సంతోషిమాత


మర్పడ్గలో గాయత్రి దేవిగా విజయదుర్గ


కుకునూరుపల్లిలో దుర్గామాత

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఏసీపీ


సాయిరమాదేవికి పూలమొక్క అందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవిని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న డ్రంక్ అండ్ డ్రైవ్, ఎంవీయాక్టు కేసుల గురించి చర్చించారు.

‘ఉపాధి’లో కొత్త పనులు గుర్తించండి: అదనపు పాలనాధికారి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో 2024-25 సంవత్సరానికి గాను కొత్త పనులను గుర్తించాలని, గతేడాది మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కూలీల సంఖ్యను పెంచాలని, అధికారులు సకాలంలో పనులు కల్పించాలన్నారు. సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈజీఎస్‌లో చేపట్టబోయే పనులపై ఏపీవో, ఈసీ, టీఏ, ఈజీఎస్ సిబ్బందికి జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నర్సరీలకు స్థలాలు గుర్తించి, భూమిని చదును చేసి మొక్కల పెంపకం, తాటి మొదలైన విత్తనాలను సేకరించాలని, ఎర్రమట్టి, నల్లమట్టిని సమకూర్చుకోవాలన్నారు. జిల్లాలో శనిగరం, సింగరాయకొండ, తపాస్‌పల్లి జలాశయాల పరిధిలోని కాల్వల్లో పూడిక తీత, పిచ్చిమొక్కల తొలగింపు ప్రక్రియ కోసం నీటిపారుదలశాఖ, ఈజీఎస్ అధికారులు కలిసి పనులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్‌ఆర్య, అదనపు పీడీ బాలకృష్ణ, ఏపీడీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యకు పరిష్కారం


వాసవీనగర్ వెళ్లే దారిలో పైపులు వేస్తున్న పురపాలిక సిబ్బంది

చేర్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అసంపూర్తి మురుగుకాలువ పనులతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వాసవీనగర్‌లో దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ కాలనీకి వెళ్లడానికి మురుగునీటిలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను గుర్తించిన పుర ఉపాధ్యక్షుడు నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం స్పందించారు. కాలనీకి వెళ్లే దారి వద్ద జేసీబీతో కాలువ తీసి పైపులు వేసి, మట్టితో పూడ్చివేశారు. తాత్కాలికంగా సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దూరవిద్యలో ప్రవేశాలకు గడువు పెంపు

దుబ్బాక, న్యూస్‌టుడే: 2024-25 విద్యా సంవత్సరానికి గాను సార్వత్రిక విద్యలో పది, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) మరోసారి పొడిగించినట్లు శుక్రవారం దుబ్బాక సార్వత్రిక విద్య మండల కో-ఆర్డినేటర్ స్వప్న తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రవేశాల గడువును ప్రభుత్వం అక్టోబర్ 31 వరకు పొడిగించిందన్నారు. 14 ఏళ్లు నిండి, బడి మానేసిన వారికి సార్వత్రిక దూరవిద్య ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఆసక్తి గలవారు www.telanganaopenschool.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని సందేహాలకు దుబ్బాక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

చేర్యాల, న్యూస్‌టుడే: పట్టణంలోని పెద్దమ్మగడ్డలోని మాతమ్మ గుడి పునర్నిర్మాణానికి పురాధ్యక్షురాలు స్వరూపారాణి శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. దశాబ్దాలుగా పూజలందుకుంటున్న అమ్మవారి ఆలయ నిర్మాణానికి పట్టణవాసులు, వ్యాపారుల సహకారం ఉందని ఆమె తెలిపారు. వైస్ ఛైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి, ఆడెపు చంద్రయ్య, పరమేశ్వర్, ఆముదాల మల్లారెడ్డి, పట్టణవాసులు పాల్గొన్నారు.

‘విలీనం అమలు నిలబెట్టుకోండి’

బెజ్జంకి, న్యూస్‌టుడే: బెజ్జంకి మండలాన్ని కరీంనగర్ జిల్లాలో విలీనం చేస్తామని ఎన్నికలకు ముందు పాలకులు ఇచ్చిన హామీని అమలు చేయాలని తెదేపా మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బెజ్జంకిలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా మండలాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపారని ఆరోపించారు.

పేదలు, అనాథలకు జమాతే ఇస్లామీ హింద్ సాయం

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: నైతిక విలువలు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాలేద్ ముబషీర్ ఉజ్‌జఫర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. 75 ఏళ్లుగా నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులైన చిన్నారులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై జమాతే ఆందోళన వ్యక్తం చేసిందన్నారు.

9న తెలంగాణ ప్రజాఫ్రంట్ ఆవిర్భావ సదస్సు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు జంగిటి నర్సింలు కోరారు. సిద్దిపేటలో శుక్రవారం కార్యక్రమ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ప్రజలు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రతిష్ఠాత్మకంగా కుటుంబ సర్వే: ఆర్డీవో

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: కుకునూరుపల్లి మండలం ముద్దాపూర్‌లో జరుగుతున్న తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. రెండ్రోజుల పాటు నిర్వహించిన సర్వేలో దాదాపు 120 కుటుంబాల వివరాలు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో రెండు రోజుల్లో మొత్తం 256 కుటుంబాల సర్వే పూర్తయినట్లు పురపాలిక కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్ గ్రామీణం: అక్కన్నపేట మండలం నందారంలో కుటుంబ డిజిటల్ సర్వే కొనసాగుతోంది. రెండో రోజు ఎంపీడీవో బానోతు జయరాం, తహసీల్దారు అనంతరెడ్డి, సూపరింటెండెంట్ శంకరయ్య ఆధ్వర్యంలో మూడు బృందాలు ఇంటింటా తిరిగి వివరాలు నమోదు చేశారు. శుక్రవారం 96 కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తయింది. సర్వే రిపోర్టును ఎప్పటికప్పుడు అక్కడి నుంచే జిల్లా అధికారులకు పంపిస్తున్నారు.

జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకం


విద్యార్థులతో మాట్లాడుతున్న గజ్వేల్ సీఐ సైదా

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటే వారి భవిష్యత్తు బాగుంటుందని గజ్వేల్ సీఐ సైదా సూచించారు. శుక్రవారం గజ్వేల్ బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, నిర్లక్ష్యం చేస్తే బాధపడాల్సి వస్తుందన్నారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం పోలీసు, మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శిరీష, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. శుక్రవారం గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కేడెట్లకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడుపొద్దన్నారు. ఎన్‌సీసీ అధికారి మహేందర్ తదితరులున్నారు.

సస్యరక్షణతోనే సుడిదోమ నివారణ


వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్, ఏరువాక కేంద్రం, తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో సుడిదోమ ఉద్ధృతి ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. రైతులందరూ పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తీసివేయాలన్నారు. తడి, పొడి విధానంలో నీటిని అందించాలని సూచించారు. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు పాటించి సుడిదోమ అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సాయికుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట అర్బన్: పచ్చిరొట్ట ఎరువులు వేస్తే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో శ్రీనాథ్ తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాలలో విత్తనోత్పత్తి వరి పంట, రంగధాంపల్లిలో జీలుగ, వరి పంటలను శుక్రవారం పరిశీలించారు.

వర్గీకరణ ప్రకారమే డీఎస్సీ నియామకాలు చేపట్టాలి

నంగునూరు: సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పు ప్రకారమే ప్రస్తుత డీఎస్సీలో నియామకాలు చేపట్టాలని భారాసవీ మండల కన్వీనర్ తప్పెట పరశురాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నంగునూరులో మాట్లాడారు. సుప్రీం తీర్పు ఆధారంగానే నియామక పత్రాలు అందజేయాలని కోరారు.

విధులు బహిష్కరించి నిరసన


నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మున్సిఫ్‌కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. హైదరాబాద్‌లో న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం కోర్టులో విధులను బహిష్కరించినట్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి జూమ్‌లాల్ నాయక్ తెలిపారు.

జూద గృహంపై దాడి.. ఐదుగురి అరెస్టు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలోని ఇంట్లో జరుగుతున్న వ్యభిచార గృహంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్ టౌన్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. ఓ మహిళ, నలుగురు విటులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. వారి నుంచి రూ.2 వేల నగదు, ఆరు ఫోన్లు, వాహనం స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆశీర్వదించండి

జగదేవపూర్, న్యూస్‌టుడే: గడచిన 25 ఏళ్లుగా ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ట్రస్మా(తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంస్థ) రాష్ట్ర కోశాధికారి పి.రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఉమ్మడి నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్న తనను ఆశీర్వదించాలని కోరారు. ట్రస్మా జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులతో అనేక ప్రయోజనాలు

ములుగు: వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటవీశాఖ గజ్వేల్ రేంజ్ అధికారి వినయ్ అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వన్యప్రాణులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అటవీశాఖ ములుగు సెక్షన్ అధికారి షేకావత్, బీట్ అధికారి ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ శశికళ, అధ్యాపకులు, పాల్గొన్నారు.

ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత

సిద్దిపేట టౌన్: ప్రజల రక్షణ తమ బాధ్యత అని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. సిద్దిపేటలోని కేసీఆర్ నగర్‌లో శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించి కాలనీవాసులకు అవగాహన కల్పించారు.

కనిపించని ఓటర్ల జాబితా!

న్యూస్‌టుడే, హుస్నాబాద్: గ్రామపంచాయతీల ఎన్నికల కోసం వెల్లడించిన ఓటర్ల జాబితా హుస్నాబాద్ మండల పరిషత్‌లో ప్రదర్శనకు అందుబాటులో లేకుండా పోయింది. నాలుగురోజుల క్రితం జాబితాలను ఆయా గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లలో వెల్లడించారు. శుక్రవారం అందుబాటులో ఉండాల్సిన మండలంలోని 17 గ్రామాల జాబితాలు నోటీసు బోర్డుపై లేవు. ఇదేమిటని కార్యాలయ సిబ్బందిని విచారించగా.. రెండురోజుల క్రితం ప్రదర్శించి లోపల పెట్టారన్నారు. జాబితా పెద్దగా ఉండడంతో పాటు బాగా బరువుందని, బయట పెడితే ఎవరైనా తీసుకెళతారని పెట్టలేదన్నారు. ఎవరైనా గ్రామాల నుంచి వచ్చి ప్రదర్శించిన జాబితాలో పేర్లను చూడాలంటే ఎలా? అనే ప్రశ్నకు సిబ్బంది నుంచి సమాధానం రాలేదు. ఓటర్ల జాబితాను కార్యాలయంలో అందుబాటులో లేని విషయంపై ఎంపీడీవోను సంప్రదించేందుకు ‘న్యూస్‌టుడే’ ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఆయన డిజిటల్ సర్వేకు వెళ్లారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

భౌతికశాస్త్రంలో పరిశోధనలకు డాక్టరేట్


ప్రొ.కరుణాసాగర్‌కు పరిశోధన గ్రంథాన్ని సమర్పిస్తున్న సంపత్

హుస్నాబాద్, కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన పిడిశెట్టి సంపత్ భౌతిక శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. పిడిశెట్టి లక్ష్మి, భూమయ్య దంపతుల రెండో కుమారుడైన సంపత్ చిన్ననాటి నుంచి చదువులో ప్రతిభ కనబర్చాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సీనియర్ ప్రొ. డి.కరుణాసాగర్ ఆధ్వర్యంలో ‘డిజైన్ ఆఫ్ మోడ్ సెలెక్టివ్ కప్లర్ ఫర్ కన్వర్షన్ ఆఫ్ స్పాటియల్ వెక్టార్ మోడ్’ అనే అంశంపై పరిశోధన చేశారు. తన పరిశోధనా గ్రంథాన్ని సమర్పించగా శుక్రవారం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. పీహెచ్‌డీ పట్టా అందుకోవడంపై గ్రామస్థులు సంపత్‌ను అభినందించారు.

టెలికాం బోర్డు సభ్యుడిగా మల్లేశం

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన భాజపాకు చెందిన మొగుళ్ల మల్లేశంను టెలికాం బోర్డు మెంబర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించినట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శుక్రవారం న్యూస్‌టుడేతో ఆయన చరవాణిలో మాట్లాడారు.. పార్టీ బలోపేతానికి కృషి చేసే కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం దక్కుతుందని పేర్కొన్నారు. మల్లేశం గతంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. భాజపా మిరుదొడ్డి మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి మెదక్ జిల్లా కిసాన్ మోర్చా ప్రభారిగా, సిద్దిపేట జిల్లా మజ్దూర్ సెల్ కన్వీనర్‌గా, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఇలా అనేక బాధ్యతలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. తనను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.